క్లుప్తంగా

ఛిద్రమైన కాలిబాట రక్షణ గోడ



ఛిద్రమైన తాతపూడి కాలిబాట వంతెన రక్షణ గోడ

కపిలేశ్వరపురం: తాతపూడి బ్యాంక్ కెనాల్‌పై ఉన్న కాలిబాట వంతెన రక్షణ గోడ పలు చోట్ల ఛిద్రమైంది. రెయిలింగ్ పెచ్చులూడి ఊచలు పైకి చొచ్చుకువచ్చాయి. వంతెన నిర్వహణ అధ్వానంగా ఉందని పలువురు స్థానికులు వాపోతున్నారు. గోదావరి గట్టు పై నుంచి తాతపూడి గ్రామానికి వెళ్లే ప్రయాణికులు ఈ కాలిబాట వంతెన మీదుగా వెళ్తుంటారు. రావులపాలెం, కపిలేశ్వరపురం వెళ్లే ద్విచక్రవాహనదారులు ఈ వంతెనపైనే వెళ్ళాల్సి ఉంటుంది. ఆదమరచి ప్రయాణించేవారికి వంతెన ఊచలు గుచ్చుకునే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మంజేరు లాకులకు మరమ్మతులు చేపట్టాలి

కాజులూరు: మండలంలో కోరంగి కెనాల్‌పై మంజేరు వద్ద ఉన్న లాకులకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా లాకుల తలుపులకు రంధ్రాలు, పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువలో లెవెలింగ్ కోసం నిలబెట్టిన నీరు రంధ్రాల ద్వారా డ్రైన్‌లోకి పోతుంది. ఈ లాకుల పై భాగంలో సుమారు పదివేల ఎకరాల ఆయకట్టు ఉందని లాకులు మరమ్మతుల కారణంగా నీరు వృథాగా పోయిఏటా తొలకరి, దాళ్వాల్లో సాగునీటి కొరత తలెత్తుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో లాకులకు మరమ్మతులు చేపట్టకుంటే నీరు వృథాగా పోయి రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు శీల గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, స్థానిక రైతులు వెంకన్న, నల్లమిల్లి రామారెడ్డి తదితరులు కోరారు.

అనధికార మోటార్ల తొలగింపు



అనధికార విద్యుత్ మోటార్లను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

కాజులూరు: మండల గ్రామాల్లో ప్లబిక్ కుళాయి కనెక్షన్లకు అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను నిర్వాహకులు వెంటనే తొలగించాలని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. శనివారం బంధనపూడిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూప, గొల్లపాలెం పోలీసులు సిబ్బందితో కలసి గ్రామాల్లో ప్లబిక్ కుళాయి కనెక్షన్లకు ఉన్న అనధికార విద్యుత్ మోటార్లను తొలగించారు. ఆయన మాట్లాడుతూ కుళాయి కనెక్షన్లకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయటం వలన పబ్లిక్ కుళాయిలకు తాగునీరు సరఫరా జరగక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బంధనపూడిలో 40 అనధికార విద్యుత్ మోటార్లను తొలగించామన్నారు.

ఏకాదశ, పంచ పౌర్ణమి వ్రత పూజలకు ఏర్పాట్లు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఏకాదశ, పంచ పౌర్ణమి వ్రత పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు శనివారం నిర్వాహకులు తెలిపారు. జూన్ 10, నుంచి అక్టోబర్ 6 వరకూ గల ఐదు పౌర్ణమి దినాల్లో పంచ పౌర్ణమి పాయస ప్రసాద వితరణ పూజలను చేయనున్నామని, జూన్ 21 నుంచి నవంబర్ 15 వరకూ గల 11 ఏకాదశి రోజుల్లో ఏకాదశ వ్రత పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామికి పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అర్చక బృందం సభ్యులు స్వామికి అభిషేక పూజలు చేశారు. టేకి గ్రామ ప్రధాన రహదారిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. వేద పండితులు స్వామిని విశేషంగా అలంకరించారు. ఇరు గ్రామాల్లోని పూజా కార్యక్రమాల్లో ఆయా గ్రామాలతో పాటు కోరుమిల్లి, మాచర, వెదురుమూడి, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మలికిపురం: మలికిపురంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక ఇండేన్ గ్యాస్ డీలర్ మండెన సత్యనారాయణ మూర్తి విరాళంగా రూ.51,116 అందించారు. శనివారం ఆలయం వద్ద ఆలయ కమిటీకి ఈ మేరకు చెక్కు అందించారు. దాత సత్యనారాయణను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, వర్తక సంఘం అధ్యక్షుడు మిరియాల హనుమంతరావు, పల్లపోతు బంగారం, వై.ఫణి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లీకుల లాకులే గతి

- సాగునీరు సంద్రం పాలు
- దీర్ఘకాలంగా శిథిల స్థితిలో లాకుల తలుపులు
- నిరుపయోగంగా సిబ్బంది క్వార్టర్లు
- ఏడాదిగా పట్టించుకోని కూటమి పాలకులు



అధ్వానంగా కపిలేశ్వరపురం లాకుల తలుపులు

కపిలేశ్వరపురం: సహజ వనరుల పరిరక్షణ పాలకుల బాధ్యత. సహజంగా ఉనికిలోకి వచ్చిన వాటిని పొదుపుగా వాడుకోవడంలో ప్రభుత్వం నేర్పుతో వ్యవహరించాలి. వాటిని సృష్టించడం మానవాళి వల్ల కాదన్నది సత్యం. ఉన్న వనరులను అత్యవసరాలు మేరకు వినియోగించునేలా ప్రజలు చైతన్యం చేయాలి. ప్రజలను చైతన్యపర్చడం మాట అలా ఉంచితే అసలుకు పాలకులే సహజ వనరులను నిర్లక్ష్యం చేస్తున్నారు. కపిలేశ్వరపురంలోని ఇరిగేషన్ శాఖ పరిధిలోని లాకుల తలుపులు ఛిద్రం కావడం, ఫలితంగా నీరు వృథాగా గోదావరి ద్వారా సంద్రాన్ని చేరుతుండటమే ఇందుకు నిదర్శనం. గోదావరి నుంచి సాగు నీటిని పంట కాలువల్లోకి మళ్లించేందుకు బ్రిటిష్ కాలంలో నిర్మితమైన లాకుల నిర్వహణలో సమస్యలు కారణంగా నీరు వృథాగా పోతుంది. లాకుల తలుపులకు చిల్లులు పడి జల్లెడను తలపిస్తున్న తీరుపై ఈ కథనం.

బ్రిటిష్ కాలం నాటి లాకులే ఇప్పటికీ...

స్థానిక లాకులను బ్రిటిష్ హయాంలో నిర్మించారు. దశాబ్దాల పాటు కపిలేశ్వరపురం, కె.గంగవరం, తాళ్లరేవు మండలాల రైతులకు చెందిన సుమారు 36,388 ఎకరాల ఆయకట్టుకు నీరందించే సామర్థ్యం గల ఈ లాకులు నిర్వహణ లోపాలతో దయనీయ స్థితికి నెట్టబడుతుంది. నీటి ఎద్దడి సమయంలో ఆయా మండలాల ఆయకట్టు రైతులకు నీరందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

జల్లెడను తలపిస్తున్న తలుపులు

లాకుల తలుపులకు చిల్లులు పడటంతో జల్లెడను తలపిస్తుంది. బ్రిటిష్ హయాంలో నాణ్యమైన కలపతో తయారు చేసిన తలుపులు శిథిల స్థితికి చేరినా అధికారులు వాటి స్థానంలో నూతన తలుపులు చేయించకపోవడంతో నీరు వృథాగా పోతుంది. చిల్లులు పడిన చోట ఇసుక మూటలను అడ్డుపెట్టి నెట్టుకుంటూ వస్తున్నారు. అత్యవసర సమయంలో తలుపులు మొరాయిస్తున్న పరిస్థితి సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నాయి. లాకుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా కాలువగట్టు కోతకు గురవుతుంది. దీంతో గట్టు చెంత ఉన్న చెట్లు నేలకూలుతున్నాయి. గట్లను పటిష్ట పరచని పక్షంలో మరిన్ని చెట్లు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

ఒకప్పుడు రవాణా మార్గంగా లాకులు

పాతరోజుల్లో ఈ బ్యాంక్ కెనాల్ ద్వారా రాజమహేంద్రవరం నుంచి యానాం వరకూ పడవల ద్వారా ప్రయాణాలు సాగించే వారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం, తాళ్లరేవు మండలాలకు చెందిన ప్రయాణికులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను ఈ కాలువ మార్గంలో తరలించేవారు. నీటి సరఫరా, ప్రయాణ మార్గాలను నిర్వహించేందుకు నావిగేషన్ వ్యవస్థను వినియోగించే వారు. తర్వాత కాలంలో నిర్వహణ లోపం కారణంగా నావిగేషన్ వ్యవస్థ దెబ్బతింది.

అధ్వానంగా సిబ్బంది క్వార్టర్లు

లాకుల నిర్వహణ ప్రాధాన్యం నేపథ్యంలో ఆ రోజుల్లో స్థానికంగా క్వార్టర్లను నిర్మించారు. నిర్వహణకు ఒక సూపరింటెండెంట్, ముగ్గురు లష్కర్లు, ఒక డెల్టా లష్కరు అవసరం కాగా వారి పని విధానాన్ని పరిశీలించేందుకు ఆలమూరు ఏఈ కార్యాలయం ఒకటి ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమంలో భవనాలు శిథిల స్థితికి చేరి విషసర్పాలు సంచరిస్తున్నాయి. తరచూ సాగునీరు క్లిష్టతరం అవుతున్న నేపథ్యంలో లాకులను ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో నీరు–చెట్టు పథకం ద్వారా లాకుల తలుపుల నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరయినప్పటికీ అనివార్య కారణాల వల్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయని నిధుల మంజూరుకు ప్రతిపాదనలను పంపించామని ఇరిగేషన్ అధికారులు చెప్పారు.

ఇరిగేషన్ అభివృద్ధి లేదు



కూటమి అధికారాన్ని చేపట్టి దాదాపు ఏడాది కాలమవుతోంది. ఏ మాత్రమూ ఇరిగేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టలేదు. నీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు తరచూ రావడానికి లాకుల అధ్వాన పరిస్థితి ఒక కారణం. సంబంధిత అధికారులు స్పందించి లాకులను మెరుగుపర్చాలి.

– గుత్తి నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు, సీపీఐ, కపిలేశ్వరపురం

పీఆర్టీయూ ఆధ్వర్యంలో టీచర్ల బదిలీల సేవా కేంద్రం



పీఆర్టీయూ ఏర్పాటు చేసిన టీచర్ల బదిలీల సేవా కేంద్రం

రామచంద్రపురం: పట్టణంలో టీచర్ల బదిలీల విషయంలో సూచనలు, సలహాలతో పాటు ఆన్‌లైన్ సేవలు అందించడానికి పీఆర్టీయూ ఆధ్వర్యంలో సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మొంగం అమృతరావులు శనివారం విలేకరులకు తెలిపారు. బదిలీల విషయంలో ఈ–సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు వారు సూచించారు. రామచంద్రపురం పట్టణంలోని పాత బస్టాండ్ వెనుక ఏపీ ఎన్జీవో హోమ్ బిల్డింగ్‌లో నెట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఆర్టీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు టీవీవీఎస్ఎస్ తిలక్‌బాబు మాట్లాడుతూ ప్రతిసారి బదిలీల సమయంలో పీఆర్టీయూ అందిస్తున్న సేవలను కొనసాగించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కొత్తుర్తి భీమశంకరం, ఓవీ రమణ, కడియాల గోవిందరాజు, డి.రామదుర్గారావు, బళ్ల దమరుకనాథం, సీపీఎస్ కన్వీనర్ పంపన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరశన దీక్ష చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్లను పరిష్కరించడంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ ఉద్యోగులు కోరుతున్నారు. నిర్దిష్టమైన పలు డిమాండ్ల సాధనకై ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల కొద్ది రోజులు పాటు సమ్మె చేశారు. ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి కొన్ని నిర్ణయాలను తీసుకోగా తర్వాత వాటిని అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో కార్మికులు మలివిడత నిరసన కార్యక్రమాల్లో నాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరశన దీక్షకు దిగారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకొన్న ప్రతి ఉద్యోగినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు హెచ్ ఆర్ పాలసీను అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు పాలపర్తి సుబ్బరాజు మాట్లాడుతూ తమకు కేవలం నెలకు రూ.13,087 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారన్నారు. పెరిగిన ధరలు, కుటుంబ నిర్వహణ ఖర్చులకు ఏ మాత్రం చాలిచాలని జీతాలతో కార్మికులంతా సతమతమవుతున్నారన్నారు. తమకు టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగుకు చెల్లించే ప్రాతిపతికన వేతనాలను చెల్లించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కప్పల అన్నవరం, సురేంద్ర, తలాటి వెంకన్న, పాలపర్తి సురేష్, పిట్టా ప్రవీణ్ కుమార్, గంటి నవీన్ కుమార్ం ఖండవిల్లి రాజు, మత్తాల రమేష్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రమాదభరితంగా ఏటిగట్టు ప్రయాణం

- అడ్డూఅదుపూ లేకుండా ఇసుక రవాణా
- భారీ వాహనాల రాకపోకలతో ఇక్కట్లు



టైరు పంక్చర్‌తో గోదావరి గట్టుపై నిలిచిపోయిన ట్రాక్టరు, ట్రక్కు, పరిమితికి మించి తరలిస్తున్న ఇసుక

కపిలేశ్వరపురం: జొన్నాడ నుంచి యానాం వరకూ గౌతమి గోదావరి గట్టుపై ప్రయాణం భారీ వాహనాల రాకపోకలతో ప్రమాద భరితంగా మారింది. ఆలమూరు, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల ద్విచక్ర వాహనదారులకు గోదారిగట్టు మీదుగా వెళ్లడం సౌకర్యవంతంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చాకా ఇసుక ర్యాంపు నిర్వహణ హద్దూ, అదుపు లేకుండా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కపిలేశ్వరపురం, తాతపూడి ర్యాంపుల నుంచి భారీ వాహనాల్లో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పేరుకు ప్రభుత్వాధికారుల నుంచి నియమ నిబంధనలు రూపొందించినా ఆచరణలో ఏ ఒక్కటి అమలు చేయడంలేదు. ఆ విషయం ఆయా ర్యాంపుల వద్దకు వెళ్లి చూసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యక్షంగా కనిపిస్తోంది. భారీ వాహనాలు వేగనియంత్రణలేదు. వాహనంలో ఇసుకను పరిమితికి మించి లోడు చేయడంతో వాహనం వెనుక ఉన్నవారి కళ్ళల్లోకి పడుతోంది. వాహనాల రాకపోకలతో ఏటిగట్టు రహదారి ఛిద్రమైంది. దీంతో వాహనాల రాకపోకలు ప్రమాదభరితంగా ఉంది. ట్రాక్టరుపై ఇసుక రవాణా సాగుతుండటంతో ట్రక్కు నిండా ఇసుకను లోడు చేయడంతో పాటు వాహన వేగానికి, రహదారి గుంతల్లో పడినప్పుడల్లా ఇసుక ఎగిరి రహదారిపై పడుతోంది. దీంతో ఇసుక రేణువులపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రయాణీకులు జారి పడుతున్నారు. తరచూ వాహనాలు గోదారి గట్టుపై మరమ్మతుకు గురై నిలిచిపోతున్నాయి. దూరపు ప్రాంతం నుంచి మెకానిక్ వచ్చి మరమ్మతు చేసే వరకూ వాహనాలు గట్టుపై అడ్డంగా నిలిచిపోవడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోందని ప్రయాణీకులు వాపోతున్నారు.

లెదర్ ఫుట్‌వేర్ తయారీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



కడలి పద్మజ్యోతి

రామచంద్రపురం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న లెదర్ ఫుట్‌వేర్ తయారీ శిక్షణకు మండలంలోని ఎస్సీ యువత దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం మండల అభివృద్ధి అధికారి కడలి పద్మజ్యోతి శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 19 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఎస్సీ కులానికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ రెండు నెలలు (60 రోజులు) ఉంటుందన్నారు. పదో తరగతి మార్కులలిస్టు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో తమ గ్రామంలోని గ్రామ సచివాలయాల వద్ద వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లను సంప్రదించాల్సిందిగా సూచించారు. శిక్షణ విశాఖపట్నం జిల్లాలోని నర్సీపట్నంలో ఎల్‌డీఎం ఈఎస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తూ రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 90309 40259, 94031 02417, 90309 24569 లపై కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రజా పథకాల రద్దు దారుణం

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



పోతంశెట్టి ప్రసాద్

కపిలేశ్వరపురం (మండపేట): పేదలకు ఇంటింటికీ రేషన్ సరుకులను అందజేసే ఎండీయూ వాహనాలను యథావిధిగా కొనసాగించాలని మండపేట మున్సిపల్ కౌన్సిల్ వైఎస్సార్ సీపీ విప్ పోతంశెట్టి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ పేదలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ రేషన్ సరుకులు అందజేసే పథకాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. జగన్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పలు పథకాలను కూటమి రద్దు చేస్తుందని మండిపడ్డారు.పేదల ప్రయోజనాలు కోసం నిర్వహించే పథకాలను ఖర్చుగా భావించరాదని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. ఈ పథకం వల్ల పేదలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశం సైతం ఉందన్నారు. ఎండీయూ నిర్వాహకుల ఉపాధి అవకాశానికి కూటమి ప్రభుత్వం గండి కొట్టడం సరికాదని వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకొవాలన్నారు.

విజ్ఞానాన్ని వికసింపజేసిన కాటన్



కాటన్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: సమాజంలో విజ్ఞానం కలిగినవారు అనేక మంది ఉన్నా చరిత్రలో గుర్తుండిపోయే స్థాయిలో విజ్ఞానాన్ని వికసింపజేసిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కు మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లి వద్ద గోదావరి గట్టుపై గ్రామస్తులు సహకారంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని శుక్రవారం రిటైర్డ్ హెచ్.ఎం చిక్కం సూర్యనారాయణ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ తోట హాజరై కాటన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లోని వరి, ఉద్యాన పంటల సాగుకు ప్రధాన కారణం కాటన్ మేథోపరమైన, సాంకేతికపరమైన కృషి అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాకా బాబ్జి, సలాది వీరబాబు, పేరాబత్తుల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ఫిల్టర్ బహూకరణ



గుమ్మిలేరులో సర్పంచ్ రాంబాబుకు వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న దాతలు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరు గ్రామ సచివాలయానికి శనివారం ఆర్వో వాటర్ ఫిల్టర్ బహూకరణ జరిగింది. గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజల తాగునీటి సమస్యలను గుర్తించిన గ్రామానికి చెందిన వంక వెంకటరమణ తన భర్త వీర్రాజు జ్ఞాపకార్థం సుమారు 15 వేల విలువైన ఆర్ఓ వాటర్ ఫిల్టర్‌ను సర్పంచ్ గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా పంచాయతీకి అందజేశారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆర్వో ప్లాంట్‌ను అందజేసిన కుటుంబ సభ్యులను సర్పంచ్ రాంబాబుతో పాటుగా పలువురు సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు. వంక వీర వెంకట శ్రీహరి, వంక సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రామచంద్రపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో మోటారుసైకిల్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరప మండలం యండమూరు గ్రామానికి చెందిన పంపన శివ శ్రీనివాస్ ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి రామచంద్రపురంలో పని ముగించుకుని రాత్రి 9.30 గంటలకు ఇంటికి వెళుతుండగా కందులపాలెం దుర్గమ్మ గుడి వద్దకు వచ్చేసరికి కాపవరం నుంచి రామచంద్రపురం వెళుతున్న ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి కాలి ఎముక విరిగిపోయింది. స్థానికులు అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలేరమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



పోలేరమ్మతల్లి

కాజులూరు: మండలంలోని ఆర్యావటంలో గ్రామదేవత పోలేరమ్మ జాతర, తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం కమిటీ సభ్యుడు పుల్లెపు సత్యనారాయణ, పాలెపు వీరబాబు తదితరులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 300 ఏళ్ల క్రితం వెలసిన పోలేరమ్మ తల్లిని ప్రజలు గ్రామదేవతగా కొలుస్తున్నారన్నారు. ఏటా వైశాఖ మాసం అమావాస్య రోజున అమ్మవారికి తీర్థమహోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి కాపు సామాజిక వర్గీయులు చిన్న జాతర, ఆదివారం రాత్రి శెట్టిబలిజ సామాజిక వర్గీయుల పెద్ద జాతర నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలతో అమ్మవారిని తెల్లవారే వరకు గ్రామ వీధుల్లో ఊరేగిస్తారన్నారు. అనంతరం సోమవారం వేకువజాము నుంచి ఆలయం వద్ద తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. పరిసర గ్రామాల నుంచి సుమారు మూడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. తీర్థమహోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం తగిన వసతి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లిలో శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారంతో పాటు మధ్యాహ్నం నుంచి త్రయోదశి తిథి కలసి రావడంతో ప్రతి శనివారం కంటే మించి భక్తులు శనైశ్చరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ–ధర్మాదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి భక్తుల పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా రూ.4,10,260, ఆన్‌లైన్ పరోక్ష పూజల ద్వారా రూ.3,71,200, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.41,433తో కలిపి మొత్తం రూ.8,22,893 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

టీడీపీ మండల కమిటీ నియామకం

కపిలేశ్వరపురం: టీడీపీ మండల కమిటీ నియామకం పార్టీ నియోజకవర్గ కార్యాలయం శనివారం ప్రకటించింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడిగా కపిలేశ్వరపురానికి చెందిన బలవరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అంగర గ్రామానికి చెందిన దానేటి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కేదారాలంక గ్రామానికి చెందిన రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నేలటూరుకు చెందిన చింతపల్లి బాలకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వల్లూరుకు చెందిన గుణ్ణం సుబ్బరాజు, నిడసనమెట్లకు చెందిన నందికోళ్ల మంగరాజు, కార్యదర్శులుగా బక్కి సుజాత, గొల్లపల్లి భవాణి, గుత్తుల జగదాంబేశ్వరి, కోశాధికారిగా పలివెల సూరయ్యలను నియమించారు. అనంతరం కమిటీ సభ్యులతో మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ళ సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సభ్యులకు సూచించారు.

ప్రాధాన్య క్రమంలో గ్రామాల అభివృద్ధి



కేశవరంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): పల్లె పండుగ తదితర పథకాలతో ప్రాధాన్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం కేశవరం గ్రామంలో రూ.44.60 లక్షలతో చేపట్టతలచిన 8 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల భూమి పూజ చేశారు.

పశువుల దాణా పంపిణీ..

మండపేట మండలంలోని కేశవరం, అర్తమూరు గ్రామాల్లోని పాడి రైతులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతులు మీదుగా శనివారం ఆయా గ్రామాల్లోని పశువైద్యశాలలు వద్ద పశువుల దాణాను పంపిణీ చేశారు. కేశవరం గ్రామంలో 35 మంది, అర్తమూరులో 40 మంది మొత్తం 75 మంది పాడి రైతులకు 50 శాతం రాయితీపై ఒక్కో పాడి రైతుకూ 50 కేజీల చొప్పున దాణాను అందజేశారు. కార్యక్రమంలో నల్లమిల్లి వీర్రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పడాల రామకృష్ణారెడ్డి, మల్లిడి సత్తిరాజు, కంటిపూడి శ్రీను పాల్గొన్నారు.